

చీఫ్ ఎడిటర్: దొండ్లవాగు భవ్య (జర్నలిస్ట్)

గ్లోబల్ వార్త

RNI.No:-APTEL/26/A2902

జాతీయ తెలుగు దినపత్రిక

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

"అతికొద్ది కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన"
"గ్లోబల్ వార్త" జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గాల్లో
రాయచోటి,
రాజంపేట, రైల్వేకోడూరు,
మదనపల్లి, పీలేరు,
తంబళ్ళపల్లి, పుంగనూరు
విలేకరులు కావలెను
వివరాలకు కింద ఉన్న ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.
ఫోన్ నెంబర్స్ - 7093627232, 9392480345, 08562-461571
MAIL ID : globalvarthaindia@gmail.com

సంపుటి 1 | సంచిక 59 | 31-10-2026 | శనివారం | పేజీలు -4 | వెల-రూ. 5

ఆన్‌లైన్‌లో స్థానిక ఎన్నికల అభ్యర్థుల అఫిడవిట్లు.. ఎస్ఈసీ కీలక నిర్ణయం



గ్లోబల్ వార్త - అమరావతి

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల అఫిడవిట్లను ఆన్‌లైన్‌లో పెడుతున్నట్లు ఏపీ హైకోర్టుకు ఎస్ఈసీ నివేదించింది. ఈ మేరకు ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం అఫిడవిట్ దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను ఆన్‌లైన్‌లో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ వల్లపర్ల శివ కార్తీక్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై స్పందించిన ఎస్ఈసీ.. అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తీసుకుంటున్న చర్యలను అఫిడవిట్ ద్వారా న్యాయస్థానానికి వివరించింది.రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చామని ఎస్ఈసీ తెలిపింది. ఈ పోర్టల్ ద్వారా మున్సిపల్, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను వీక్షించే అవకాశం ఉందని పేర్కొంది. మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల నామినేషన్ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు వెల్లడించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, సెల్ఫ్ అఫిడవిట్లు కూడా వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించామని హైకోర్టుకు తెలిపింది. పోలింగ్ తేదీకి ముందుగానే అభ్యర్థులకు సంబంధించిన వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. భారీ స్థాయిలో ఉండే డేటా దృష్ట్యా గ్రామీణ, మున్సిపల్ శాఖల అధికారిక వెబ్‌సైట్ల ద్వారా సమాచారం అందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. సంబంధిత శాఖల వెబ్‌సైట్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి లింకులు ఇవ్వాలని సూచించింది. అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచిస్తూ.. ఈ మేరకు గ్రామీణ, మున్సిపల్ శాఖల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం లేఖలు రాసింది. ఆన్‌లైన్‌లో వివరాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో స్థానిక ఎన్నికల అభ్యర్థుల అఫిడవిట్లు..

గ్లోబల్ వార్త - అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల అఫిడవిట్లను ఆన్‌లైన్‌లో పెడుతున్నట్లు ఏపీ హైకోర్టుకు ఎస్ఈసీ నివేదించింది. ఈ మేరకు ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం అఫిడవిట్ దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను ఆన్‌లైన్‌లో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ వల్లపర్ల శివ కార్తీక్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై స్పందించిన ఎస్ఈసీ.. అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తీసుకుంటున్న చర్యలను అఫిడవిట్ ద్వారా న్యాయస్థానానికి వివరించింది.

రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చామని ఎస్ఈసీ తెలిపింది. ఈ పోర్టల్ ద్వారా మున్సిపల్, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను వీక్షించే అవకాశం ఉందని పేర్కొంది. మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల నామినేషన్ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు వెల్లడించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, సెల్ఫ్ అఫిడవిట్లు కూడా వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించామని హైకోర్టుకు



తెలిపింది. పోలింగ్ తేదీకి ముందుగానే అభ్యర్థులకు సంబంధించిన వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

భారీ స్థాయిలో ఉండే డేటా దృష్ట్యా పిఆర్ అండ్ ఆర్‌డి మున్సిపల్ శాఖల అధికారిక వెబ్‌సైట్ల ద్వారా సమాచారం అందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. సంబంధిత శాఖల వెబ్‌సైట్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి లింకులు ఇవ్వాలని సూచించింది. అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచిస్తూ.. ఈ మేరకు పిఆర్ అండ్ ఆర్‌డి, మున్సిపల్ శాఖల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం లేఖలు రాసింది. ఆన్‌లైన్‌లో వివరాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు.

సికింద్రాబాద్‌లో అక్రమ అండాల సేకరణ గుట్టురట్టు..

అదుపులోకి 10 మంది యువతులు

గ్లోబల్ వార్త - సికింద్రాబాద్

సికింద్రాబాద్: బేగంపేటలో యువతుల అండాల సేకరణ వ్యవహారం కలకలం రేపుతోంది. బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన యువతుల నుంచి అక్రమంగా అండాలు సేకరిస్తున్నట్లు బేగంపేట పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ప్రకాశ్ నగర్‌లోని నజ్రాన్ అపార్ట్‌మెంట్‌పై ఎస్ఓటీ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరుతో గత ఏడాది కాలంగా అక్రమ అండాల సేకరణ వ్యవహారం నడుస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అనంతరం అక్కడ ఉన్న బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సుమారు 8 నుంచి 10 మంది యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఓ మహిళ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకుని అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. సంతాన సాఫల్య కేంద్రాలకు యువతుల అండాలను సరఫరా



చేస్తున్నారా? అనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అలాగే, అండాల అక్రమ సేకరణ, విక్రయాల వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా, పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

దేశవ్యాప్తంగా ఒమేగా హాస్పిటల్స్‌పై ఐటీ దాడులు

గ్లోబల్ వార్త - హైదరాబాద్ : దేశవ్యాప్తంగా 24 ప్రాంతాల్లోని ఒమేగా హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో ఏకకాలంలో ఐటీ అధికారులు శుక్రవారం ముమ్మరంగా సోదాలు చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లలో విస్తృత సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఇన్వెస్టిగేషన్ వింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఐటీ అధికారుల బృందాలు రంగంలోకి దిగాయి. హాస్పిటల్ శాఖలతో పాటు పలువురు కీలక వైద్యుల ఇళ్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఐటీ అధికారుల సోదాల్లో భారీగా కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్క్‌లు, ఆర్థిక లావాదేవీల రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పన్ను ఎగవేత, భారీ నగదు లావాదేవీల ఆరోపణల నేపథ్యంలోనే ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ఒమేగా హాస్పిటల్స్ యాజమాన్యం, కీలక డైరెక్టర్ల ఆర్థిక మూలాలపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు.

చొక్కా మడతపెడితే భయపడతామా..?



గ్లోబల్ వార్త - తాడిపత్రి (అనంతపురం): 'చొక్కా మడతపెడతా అంటే భయపడతామా..? రప్పా రప్పా అంటూ రాష్ట్రాన్ని నాశనం చేశారు' అని మాజీ సీఎం జగన్‌పై జేసీ ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 'ఎన్నికల్లో అందరూ పోటీచేయాలని, లేకపోతే టికెట్ ఇవ్వనని మీ పార్టీవాళ్లను బెదిరించావు. నీపులివెందులలోనే 65 ఎంపీటీసీలకు 64 ఏకగ్రీవం అయ్యాయి. నీ పరిస్థితి ఏమిటి..?' అని ప్రశ్నించారు. తాడిపత్రి లో ఫయాజ్‌బాషాకు టికెట్ ఇచ్చి నట్టేట ముంచారని విమర్శించారు. 'ఫయాజ్.. నువ్వు మంచోడివి. కానీ ఏదేదో మాట్లాడుతున్నావ్. అభివృద్ధి ఎవరు చేశారో ప్రజలకు తెలుసు. ప్రజలే తీర్పు ఇస్తారు' అని అన్నారు.

మీరు ఆరోజు మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదా? జైలులో ఉండి నేను నామినేషన్ వేసి గెలిచాను. మేము తాడిపత్రి ప్రజల కోసం ధైర్యంగా పోరాడుతాం' అని అన్నారు. తాడిపత్రి వక్ఫ్‌బోర్డు ఆస్తి ఇప్పటికీ రూ. 64 లక్షలు ఉంది. మీ హయాంలో ఎంత అభివృద్ధి చేశారు..? ఎంత డబ్బు మిగిలింది?' అని ప్రశ్నించారు. రమేష్ రెడ్డి అరాచకాలు, అన్యాయాలు అన్ని ఇన్ని కాదని, బుగ్గరోడ్డులో రెండు ఎకరాల భూమిని, మరోచోట 10 ఎకరాల భూమిని కాజేశాడని ఆరోపించారు. వీఆర్ రామిరెడ్డి పార్టీని నమ్మి డబ్బులు కాజేసుకున్నాడని, ఇక్కడ నుంచి వెళ్లి ఎక్కడైనా చూసుకోవాలని సూచించారు. యల్లనూరు మండలం ప్రశాంతంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, విద్యావంతులని పోటీల్లో నిలిపి మండలాన్ని అభివృద్ధి చేయాలని చూస్తున్నామని అన్నారు. భోగాతి నారాయణరెడ్డి మంచి వ్యక్తి అని, కానీ అతని కుమారులు ప్రతాప్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి విర్రవీగుతున్నారని మండిపడ్డారు. తమ ఇంటిపక్కనే ఉంటూ, గన్ కనిపించేలాగా తిరుగుతున్నారని, పద్ధతి మార్చుకోవాలని సూచించారు. వారికి గన్నులు ఇచ్చిందే తాము అని అన్నారు.



విశాఖ పోర్టులో భారీ అగ్నిప్రమాదం

నిర్మాణంలో ఉన్న కన్వేయర్ బెల్టులో మంటలు

గ్లోబల్ వార్త - విశాఖపట్నం

విశాఖ పోర్ట్ ట్రస్ట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. సీ హార్స్ జంక్షన్ సమీపంలోని జె.ఎం. భక్షి కంపెనీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న కన్వేయర్ బెల్ట్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో శుక్రవారం మధ్యాహ్నం 1:45 గంటల సమయంలో మంటలు భారీగా వ్యాపించాయి. భారీగా మంటలు ఎగిసిపడటం, దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే విశాఖ పట్నం పోర్ట్ ట్రస్ట్ అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఫైర్ ఇంజిన్లతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే, ఇప్పటివరకు మంటలు అదుపులోకి రాలేదు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏపీ రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ నిధులు.. రూ.2,234 కోట్లు విడుదల

గ్లోబల్ వార్త - అమరావతి

అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతుల ఖాతాల్లో నిధులను కూటమి ప్రభుత్వం జమ చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రెండో విడతగా రాష్ట్ర వాటాగా రూ.2,234.03 కోట్ల నగదును విడుదల చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో వేగంగా రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ అవుతున్నాయి. 24 గంటల వ్యవధిలోనే 99.44 శాతం మంది రైతుల ఖాతాలో ఈ ఆర్థిక సాయం జమ కానుంది. వివిధ సాంకేతిక కారణాలతో కేవలం 17,828 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. త్వరితగతిన సాంకేతిక సమస్యల్ని పరిష్కరించి మిగిలిన రైతులకూ ఈ నిధులు అందేలా చూడాలని అధికా రులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ రెండేళ్లలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద రూ.15,236.35 కోట్ల నిధులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేసిన విషయం విదితమే.

విజయవాడలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

గ్లోబల్ వార్త - విజయవాడ

నవంబర్ 1న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది. తమ ఓటు హక్కును వినియోగించుకునేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో అక్టోబర్ 29, 30 తేదీల్లో బ్యాలెట్ పద్ధతిలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు విజయ వాడ కలెక్టర్ లక్ష్మీశ ఆ జిల్లాలో కొన సాగుతున్న ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. 'నవంబర్ ఒకటో తేదీన జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికి ఇప్పటికే ట్రైనింగ్ ఇచ్చాం. ఎప్పటికప్పుడు పొలిటికల్ కోఆర్డినేషన్ మీటింగ్ పెట్టుకొని ఎలక్షన్ కమిషన్ నుంచి వచ్చే డైరెక్షన్స్‌ని వాళ్లకి తెలియచేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేదు. మేము ప్రాపర్‌గా ప్రిపేర్ అవుతున్నాం. సెన్సిటివ్, క్రిటికల్ గ్రామాలను ముందుగానే గుర్తించాము. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేశాం. ప్రతి ఊర్లో బందోబస్తును ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేశాం. ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోండి. ప్రజాస్వామ్యం ఇచ్చిన హక్కు ద్వారా మీకు నచ్చిన వ్యక్తులను ఎన్నుకోండి' అని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

-: లోపలి పేజీల్లో :-

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ...8లో

బద్రీనాథ్ నుంచి తిరిగి వస్తుండగా హెలికాప్టర్ ..8లో



రైతులకు అన్నిరకాలుగా అండగా ఉంటాం

సీఎం చంద్రబాబు భరోసా

గ్లోబల్ వార్త - పశ్చిమగోదావరి

ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన రైతులను అన్నిరకాలుగా ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా కల్పించారు. నర్సా పురం మండలంలో నీట మునిగిన పొలాలను సందర్శించి, బాధిత రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. రైతన్నలు అధైర్యపడవద్దని పేర్కొన్నారు. తుఫాన్ నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఓ బృందం కూడా ఏపీలో పర్యటిస్తుందని వివరించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా శుక్రవారం నర్సాపురం, మొగల్తూరుల్లో

తరువాయి 2లో



మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించండి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

గ్లోబల్ వార్త - అమరావతి

: తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈరోజు (శుక్రవారం) కాకినాడ జిల్లాపై ఆర్నబ్ తుఫాన్ ప్రభావం, సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగంతో, తీర ప్రాంత గ్రామాల ప్రజలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు డిప్యూటీ సీఎం కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.

మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తా..

వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని స్పష్టం చేశారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మత్స్యకారుల సమస్యలపై స్వయంగా తాను అధ్యయనం చేస్తానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ప్రచారానికి తెర.. పోలింగ్‌కు సర్వం సిద్ధం

మున్సిపల్ ఎన్నికలకు 36 వేల మందికి పైగా సిబ్బంది మోహరింపు
671 అత్యంత సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
మరో 1,233 సున్నిత కేంద్రాలపై ప్రత్యేక నిఘా



గ్లోబల్ వార్త - గుంటూరు జిల్లా

మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం ముగింపు దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు నిర్వహిస్తున్న ప్రచారానికి ఇవాళ సాయంత్రంతో తెరపడనుంది. నవంబర్ 1న జరగనున్న పోలింగ్‌కు ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 12,244 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 1.03 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. నవంబర్ 1న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 36 వేల మందికి పైగా సిబ్బందిని మోహరించారు. వివిధ జిల్లాల్లో 671 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. మరో 1,233 సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి పర్యవేక్షణ, బందోబస్తు కోసం అదనంగా 4,943 మంది సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. ప్రచారం ముగిసిన అనంతరం ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా ప్రచార ఘట్టం ముగియనుండటంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. నవంబర్ 1న ఓటర్లు ఇచ్చే తీర్పుతో పురపాలక ఎన్నికల భవితవ్యం తేలనుంది.

నంద్యాల పురపోరులో డాక్టర్ బాబన్‌కు వైద్య కుటుంబాల మద్దతు

వైద్యుల ఆత్మీయ సమావేశంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్



గ్లోబల్ వార్త- నంద్యాల

నంద్యాల పురపాలక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్‌కు మద్దతుగా శుక్రవారం వైద్యుల కుటుంబాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణ అభివృద్ధి కోసం కూటమి తరఫున పోటీ చేస్తున్న చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్‌తో పాటు 52 వార్డుల్లోని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. నంద్యాల అభివృద్ధికి తాను విశేషంగా కృషి చేశానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. టీడీపీ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్ మాట్లాడుతూ నంద్యాల పట్టణ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి ఫరూక్ సహకారంతో పట్టణంలో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మంత్రి ఫరూక్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు. టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, ప్రొద్దుటూరు శాసనసభ పార్టీ పరిశీలకులు ఏవీఆర్ ప్రసాద్, సీనియర్ వైద్యులు డాక్టర్ గెలివి సహదేవుడు, అంజనేయస్వామి దేవాలయ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ వసుధ తదితరులు సమావేశంలో ప్రసంగిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. ఈ సమావేశాన్ని ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ మహమూద్ నిర్వహించారు. నంద్యాల పట్టణానికి చెందిన పలువురు వైద్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు.



10వ వార్డు అభివృద్ధే లక్ష్యం- ప్రజా సంక్షేమమే ధ్యేయం!

గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీలోని 10వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి విజయలక్ష్మి ని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచారంలో టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి , బీజేపీ నాయకులు లక్ష్మయ్య , కంబల్లి గంగాధర్ రెడ్డి , ఫిజియోథెరపీ డాక్టర్ సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి విజయలక్ష్మి కి, మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి గీతా కి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరుతూ 10వ వార్డు అభివృద్ధే లక్ష్యం ప్రజా సంక్షేమమే ధ్యేయం అని తెలియజేస్తూ వార్డు ప్రజలు అభ్యర్థిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో రగిలిన ఎన్నికల రణం

: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కారుపై రాళ్ల దాడి..

గాంధీ బొమ్మ సెంటర్‌లో భగ్గుమన్న ఉద్రిక్తత!

గ్లోబల్ వార్త - జమ్మలమడుగు

మున్సిపల్ ఎన్నికల ప్రచారంతో నివురుగప్పిన నిప్పులా ఉన్న జమ్మలమడుగు ఒక్కసారిగా భగ్గుమంది. ప్రచారాన్ని ముగించుకుని తిరిగి వస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హైమావతి ప్రయాణిస్తున్న కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని దుండగులు ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించారు. కారు అద్దాలు ధ్వంసమై క్షణాల్లో భయానక వాతావరణం నెలకొనగా, అభ్యర్థి హైమావతి ఈ దాడి నుంచి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఎన్నికల వేళ ప్రత్యర్థుల కుట్రలతోనే ఈ దాడి జరిగిందన్న వార్త పట్టణమంతా దావానలంలా వ్యాపించడంతో తీవ్ర కలకలం రేగింది. దాడి సమాచారం తెలియగానే వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. వేలాదిగా కార్యకర్తలు, నాయకులు సంఘటనా స్థలానికి దూసుకురావడంతో పట్టణంలో ఒక్కసారిగా యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి సతీమణి ఇందిరమ్మ, బాధితురాలు హైమావతితో కలిసి పార్టీ శ్రేణులు పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో బైఠాయించి భారీ ధర్నాకు దిగారు. రహదారులను దిగ్బంధించి, దాడికి పాల్పడిన సూత్రధారులను తక్షణమే అరెస్ట్ చేయాలంటూ హోరెత్తించిన నినాదాలతో జమ్మలమడుగు దద్దరిల్లింది. అధికార పార్టీ, ప్రతిపక్ష శ్రేణుల మధ్య ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని రీతిలో హై టెన్షన్ నెలకొనడంతో పోలీసులు భారీగా రంగంలోకి దిగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలోని కీలక కూడళ్లలో బారికేడ్లు ఏర్పాటు చేసి, అదనపు బలగాలను మోహరించారు. నిరసనకారులను శాంతింపజేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తుండగా, ఎన్నికల ప్రచారం కాస్తా రాళ్ల దాడులు, రోడ్డుపై బైఠాయింపులతో రణరంగంగా మారడంతో జమ్మలమడుగు ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు

రైతులకు అన్ని రకాలుగా

(మొదటి పేజీ తరువాయి)

ఏరియల్ సర్వే ద్వారా దెబ్బతిన్న పంటపొలాలను ముఖ్య మంత్రి పరిశీలించారు. మొగల్తూరు, నర్సాపురం మండలాల్లో పర్యటించి, క్షేత్రస్థాయి లో ప్రభావిత ప్రాంతాల పరిస్థితిని అధ్యయనం చేశారు.

తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరిస్తా: సీఎం

పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురం – పాలకొల్లు రోడ్డులోని కొత్త కాలనీ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ వెళ్తుండగా ఖాళీ బిందెలతో మహిళలు నిల్చోని ఉన్నారు. మహిళలను చూసి సీఎం కారు దిగి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. తమ కాలనీ ఏర్పాటుచేసి 25 ఏళ్లు గడిచిందని.. నేటికీ నీళ్లు లేవని మహిళలు తెలిపారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో చౌడమ్మ తల్లికి విశేష పూజలు

గ్లోబల్ వార్త - పులివెందుల



పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం విశేష అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు, అమ్మవారిని దర్శించిన వారికి సకల నరఘోష తొలగి జన,ధన ఆకర్షణ శక్తి పెరుగుతుంది అని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్, అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ కష్టాలలో ఉన్నపుడు శుక్రవారము లేదా పౌర్ణమి అమావాస్య రోజున 108 ప్రదక్షిణములు చేసి అమ్మని వేడుకుంటే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకము,.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మారోమ్రోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



జడ్పిటిసి అభ్యర్థి కోసం చిన్నకుడాల, రామట్లపల్లెలో జోరుగా ప్రచారం

గ్లోబల్ వార్త - లింగాల

లింగాల మండలంలో కూటమి బలపర్చిన జడ్పీటీసీ అభ్యర్థి విజయం కోసం కూటమి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి సతీమణి, కూటమి జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం చిన్నకుడాల, రామట్లపల్లె గ్రామాలలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ ప్రచార కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ, లింగాల సింగిల్ విండో చైర్మన్ నవీన్ కుమార్ రెడ్డి, చిన్నకూడల "ఎంపీటీసీ లోమాడ స్నేహ' మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు గ్రామంలోని ప్రతీ ఇంటికీ తిరిగి ప్రజలను నేరుగా కలిశారు. కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవికి ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల మద్దతుతో కూటమి విజయం లాంఛనమేనని, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు.



టీడీపీ నేతలకు కోర్టులో భారీ ఊరట

2022 నాటి కేసును కొట్టివేసిన న్యాయస్థానం

గ్లోబల్ వార్త -తిరుపతి

తిరుపతిలో తెలుగుదేశం పార్టీ నాయకులకు న్యాయస్థానంలో ఊరట లభించింది. 2022 మున్సిపల్ ఎన్నికల సమయంలో నమోదైన కేసును తిరుపతిలోని 1వ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (ఎజీవీఖీజ) కోర్టు కొట్టివేసింది. టీడీపీ నేతలు జేబీ శ్రీనివాస్, విజయ్ కుమార్, వెంకట కీర్తిపై నమోదైన కేసులో కీలక తీర్పు వెలువడింది. అభియోగాలకు సరిపడా సాక్ష్యాధారాలు లేవని పేర్కొంటూ న్యాయస్థానం కేసును కొట్టివేసినట్లు సమాచారం. ఈ తీర్పుపై తిరుపతి టీడీపీ ఇన్‌ఛార్జి జేబీ శ్రీనివాస్ స్పందిస్తూ న్యాయం గెలిచిందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతోనే తమపై తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. 2022 మున్సిపల్ ఎన్నికల సమయంలో దొంగ ఓట్ల వ్యవహారాన్ని ప్రశ్నించినందుకే తమపై కేసులు నమోదు చేయించారని జేబీ శ్రీనివాస్ ఆరోపించారు. అప్పటి వైసీపీ నాయకులు భూమన కరుణాకరరెడ్డి, అభినయ్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని తమపై అక్రమ కేసులు పెట్టించారని వ్యాఖ్యానించారు. తమ కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నించారని, అయినప్పటికీ న్యాయపోరాటం కొనసాగించామని తెలిపారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు తమ వాదనకు బలాన్నిచ్చిందని పేర్కొన్నారు. తమపై కేసులు పెట్టించిన వ్యవహారంపై వైసీపీ నాయకులు తిరుపతి ప్రజలకు సమాధానం చెప్పాలని జేబీ శ్రీనివాస్ సవాల్ విసిరారు. నవంబర్ 1న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 2022 నాటి కేసులో వెలువడిన ఈ తీర్పు తిరుపతి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



మార్కాపురంలో కూటమి విజయగర్జన

చివరి రోజు ప్రచారంలో కదంతొక్కిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మార్కాపురాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

గ్లోబల్ వార్త - మార్కాపురం:

మార్కాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన శుక్రవారం పట్టణంలో కూటమి శ్రేణులు భారీ బైక్ ర్యాలీతో తమ ఐక్యతా బలాన్ని చాటుకున్నాయి. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కదంతొక్కారు.మార్కాపురం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జునతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ పూల సుబ్బయ్య కాలనీ ఆర్చి నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమైంది. పవర్ ఆఫీస్, ఆర్టీసీ బస్టాండ్, కోర్టు సెంటర్, కంభం బస్టాండ్, ఎల్ఐసీ కార్యాలయం, నెహ్రూ బజార్, అమ్మవారి శాల, రథం బజార్, నాయుడు బజార్, కాలేజీ రోడ్డు, సెవెన్ హిల్స్ సెంటర్ మీదుగా తూర్పు వీధి జమ్మిచెట్టు సెంటర్ వరకు ర్యాలీ ఉత్సాహంగా సాగింది.

మూడు పార్టీల జెండాలు, నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో ర్యాలీ సందడిగా సాగింది. అనంతరం తూర్పు వీధిలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద నిర్వహించిన సభలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే అది వృథా అయినట్లేనని వ్యాఖ్యానించారు. మార్కాపురం జిల్లా సాధన, వెలుగొండ ప్రాజెక్టు వంటి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. హార్టికల్చర్ హబ్, ఇంటింటికీ పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా, పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మార్కాపురం పట్టణం దౌర్జన్యాలు, అరాచకాలు, భూకబ్జాలతో అభివృద్ధికి దూరమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. మార్కాపురం పట్టణ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జునతో పాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున, వివిధ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు,



తిరుమల కొండదారిలో ప్రమాద ఘంటికలు

తిరుమల రెండో ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

16వ మలుపు వద్ద మహారాష్ట్ర వాహనం బోల్తా

పలువురికి గాయాలు.. నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

గ్లోబల్ వార్త-తిరుమల:

తిరుమల రెండో ఘాట్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 16వ మలుపు వద్ద మహారాష్ట్రకు చెందిన వాహనం ప్రమాదానికి గురికావడంతో ఘాట్ రోడ్డులో ఒక్కసారిగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఘటనతో ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్, ట్రాఫిక్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, క్షతగాత్రుల సంఖ్య, వారి పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనంతపురంలో కూటమి ఐక్యతా శక్తి.. భారీ బైక్ ర్యాలీ

టవర్ క్లాక్ నుంచి గాంధీ బజార్ వరకు హోరెత్తిన ఎన్నికల ప్రచారం

నగర సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ: టీ.సీ. వరుణ్

గ్లోబల్ వార్త-అనంతపురం:

మున్సిపల్ ఎన్నికల తుది ప్రచారంలో భాగంగా అనంతపురం నగరంలో ఎన్డీఏ కూటమి తన ఐక్యతా బలాన్ని చాటుకుంది. టవర్ క్లాక్ నుంచి గాంధీ బజార్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ, రోడ్ షోతో నగరంలో ఎన్నికల సందడి నెలకొంది. జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కూటమి అభ్యర్థుల విజయానికి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ తోఖన్ సాహు, రాష్ట్ర మంత్రి శ్రీ సత్యకుమార్, ఎమ్మెల్యే శ్రీ దగ్గుపాటి, సినీనటుడు శ్రీ బాబు మోహన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మన్ శ్రీ టీ.సీ. వరుణ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తల భారీ సమీకరణతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అనంతరం తాడిపత్రి బస్టాండ్ గాంధీ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తోఖన్ సాహు మాట్లాడుతూ అనంతపురం నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మేయర్ అభ్యర్థి అజేష్ బాబును గెలిపిస్తే నగర అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నగరంలో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, డంపింగ్ యార్డు సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని నాయకులు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో అనంతపురం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మన్ టీ.సీ. వరుణ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రోత్సాహం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అనంతపురం నగరాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని తెలిపారు. నగర ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి నాయకులంతా ఐక్యంగా పనిచేస్తారని వివరించారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి భారీ విజయాన్ని అందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకులు, ఎమ్మెల్యే, సినీనటుడు, స్థానిక కూటమి నేతలు ఒకే వేదికపైకి రావడంతో అనంతపురం నగరంలో ఎన్నికల ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఆర్నబ్ తుపాను కష్టాల్లో ఏపీకి అండగా తమిళనాడు



తుపాను అర్నబ్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడారు తుపాను సృష్టించిన విధ్వంసం, విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పునరుద్ధరణ పనులకు అదనపు సిబ్బంది, సామగ్రి అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో తమిళ నాడు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని మంత్రి గొట్టిపాటి కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తమిళనాడు ప్రభుత్వం.. ఏపీకి విద్యుత్ సిబ్బందితో పాటు అవసరమైన సామగ్రిని పంపేందుకు సుముఖత వ్యక్తం చేసింది. దీంతో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులకు మరింత బలం చేకూరనుంది. ఇప్పటికే తెలంగాణ సాయం.. ఆర్నబ్ తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను వీలైనంత త్వరగా సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల సహకారం తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వాన్ని కూడా విద్యుత్ పునరుద్ధరణ పనులకు సహాయం అందించాలని కోరింది. తెలంగాణ సరిహద్దు జిల్లాల నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది తుపాను ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని మరమ్మతు పనుల్లో పాల్గొంటున్నారు. మరోవైపు తమిళనాడు నుంచి కూడా సిబ్బంది, సామగ్రి అందుబాటులోకి వస్తే సహాయక చర్యలు మరింత వేగవంతం కానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఆర్డీవో

మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

భద్రత, సీసీ కెమెరాల నిఘాపై అధికారులకు దిశానిర్దేశం

గ్లోబల్ వార్త -- చిలకలూరిపేట

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) అధికారులను ఆదేశించారు. చిలకలూరిపేట పట్టణంలో ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం కేటాయించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రంలో మౌలిక వసతులు, బారికేడింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు, మున్సిపల్ డీఈ రహీం, ఇతర పురపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో ఆరవ డివిజన్

వెంకట శివకు మద్దతుగా అఖిల పక్ష ప్రజాసంఘాల విస్తృత ప్రచారం



గ్లోబల్ వార్త - కడప

విద్యావంతుడు, ప్రజా ఉద్యమాల్లో ఆరితేరిన సిపిఐ నగర కార్యదర్శి నేసే వెంకట శివ ఆరవ డివిజన్ కార్పొరేటర్ స్థానానికి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో కంకి కొడవలి గుర్తుకు ఓట్లు వేసి వేయించి గెలిపించాలని శుక్రవారం డివిజన్ ప్రాంతాలైన ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఫరీదానగర్, బుద్ధ టౌన్షిప్, శివానందపురం, వడ్డెర కాలనీ, పుట్లంపల్లె, ఎస్టీ కాలనీ, లక్ష్మీ నగర్, సరోజినీ నగర్, రాజీవ్ గృహకల్ప, బుద్ధ టౌన్షిప్, చెర్లోపల్లి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు, మోడల్ బ్యాలెట్ పేపర్లను ఓటర్లకు పంచుతూ కార్పొరేటర్ స్థానానికి తెలుపు రంగు బ్యాలెట్ నెంబర్ 3 ఎదురుగా నేసే వెంకట శివ , కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. కడప నగరాభివృద్ధి, 6వ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నించే గొంతుక వెంకట శివను గెలిపించడం ద్వారా అన్ని విధాలుగా ఆరవ డివిజన్ అభివృద్ధి చేసే దానికి ఆస్కారం ఉంటుందన్నారు. లోపల నగర పాలక వర్గంలోనూ, బయట ప్రజా ఉద్యమాల ద్వారా ఆరవ డివిజన్ అభివృద్ధికి ద్వారా నగరాభివృద్ధికి కృషి జరుగుతుందన్నారు. ప్రశ్నించే గొంతకులు చట్టసభల్లో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి వెంకట శివ తో పాటు సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, ఆర్ సి పి నేత ప్రసాద్, హేతువాద సంఘం నాయకులు సిఆర్వి ప్రసాద్, లోక్ సత్తా నేత ,నాయకులు ఆర్ఎస్ఎఫ్ నాయకులు డిఎం ఓబులేసు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకుడు ఆంజనేయులు, రిటైర్డ్ అధికారులు గుర్రప్ప, గోపాల్, శశి ప్రభ, శంకర్ సిపిఐ నాయకులు సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, శంకర్ నాయక్,వెంకట్రాముడు అఖిల పక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు గోవిందు, విజయ్, భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, రమేష్, బ్రహ్మం,చంద్రపాల్, వెంకటయ్య, దస్తగిరమ్మ, నరసమ్మ, ఈశ్వరయ్య, నరసింహులు, రూప్ కాంత్, సుభాన్, ఝాన్సీ, శాంతి, సుబ్బలక్ష్మమ్మ, రాముడు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ పోరులో కూటమి దూకుడు

7, 8, 24 వార్డుల్లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విస్తృత ప్రచారం

24వ వార్డులో టీడీపీలో చేరిన పది కుటుంబాలు

గ్లోబల్ వార్త - మార్కాపురం

మార్కాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థుల తరఫున శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పట్టణంలోని 7, 8, 24వ వార్డుల్లో పర్యటిస్తూ చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జునతో పాటు ఆయా వార్డుల కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 24వ వార్డుకు చెందిన పది కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, దౌర్జన్యాలు, అరాచకాలు, భూకబ్జాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఈ అంశాలను మార్కాపురం పట్టణ ప్రజలు మరిచిపోలేదని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం మార్కాపురం ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా కేంద్రం సాధన, వెలుగొండ ప్రాజెక్టు, పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులను ప్రస్తావించారు. హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. పట్టణ శివారు ప్రాంతాలకు సైతం ఇంటింటికీ పైపుల ద్వారా నీటి సరఫరా చేసే పథకాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. మార్కాపురం పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జునతో పాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల సబ్ జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్ విజిట్

గ్లోబల్ వార్త - పులివెందుల

రవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయాధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప శ్రీ జి .రామ గోపాల్ వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి తెలియజేశారు. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.



పులివెందుల పురోగతికి ఆలోచించని వారు, పూలంగళ్ళ సర్కిల్లో ప్రచారమా?

మెడికల్ కళాశాలకు వచ్చిన 50 సీట్లు వద్దన్న వ్యక్తులకు అవకాశం ఇవ్వాలా అక్రమ, అరాచకపు చర్యలతో పులివెందులలో నెగ్గే ప్రయత్నం చేస్తున్న తెదేపా కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఆరోపణలు

గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల ప్రజల చిరకాల వాంఛ అయిన మెడికల్ కళాశాలకు వచ్చిన 50 సీట్లు వద్దన్న వ్యక్తులు ఒక అవకాశం అంటూ మీ ముందుకు వస్తున్నారని, పులివెందుల పురోగతి ఆలోచించని వారు, పూలంగళ్ళ సర్కిల్లో ప్రగల్భాలు పలుకుతూ అక్రమ మరియు అరాచకం చర్యలతో విజయం దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెదేపా నేతల చర్యలపై జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ?పులివెందుల నియోజకవర్గంలో ఎన్నికల వేళ ఉద్రిక్త పరిస్థితులు సృష్టించేందుకు బయటి ప్రాంతాల నుంచి జనాలను భారీగా తరలిస్తున్నారని, శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే స్వయంగా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యక్తులకు లాడ్జీలు బుక్ చేసి సహకరిస్తున్నారని, క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడేందుకు అధికార యంత్రాంగం అండగా నిలుస్తోందని, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణరెడ్డి, ప్రొద్దుటూరు నుంచి కొండారెడ్డి, కమలాపురం నుంచి పుత్తా నరసింహారెడ్డి తమ అనుచరులను పులివెందులకు తరలించేందుకు వ్యూహాత్మకంగా ప్లాన్ చేస్తున్నారని ఎంపీ స్పష్టం చేశారు. గతంలో జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అవలంబించిన అప్రజాస్వామిక విధానాలనే ఇప్పుడూ ప్రయోగించేందుకు ప్రత్యర్థులు సిద్ధమవుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. స్థానిక ప్రజలను, పోలింగ్ ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేసి కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకోవడమే వీరి ప్రధాన ఉద్దేశమని అవినాష్ రెడ్డి తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా జరుగుతున్న ఈ కుట్రలపై ఎన్నికల కమిషన్, ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి విజయమే లక్ష్యంగా ప్రచారం

గ్లోబల్ వార్త - లింగాల

లింగాల మండలం జెడ్పిటిసి కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళా దేవి నీ గెలిపించాలని లింగాల గ్రామంలో కూటమి నాయకుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి సతీమణి, లింగాల మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి విజయమే లక్ష్యంగా లింగాల గ్రామంలో కూటమి నాయకులు ఎన్నికల విస్తృత ప్రచారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారెడ్డి లత రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గద్దం అమర్నాథ్ యాదవ్, లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ, కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవికి మద్దతు తెలిపి ఘనవిజయం అందించాలని కోరారు. పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి సహకారంతో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా.. కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు..



బీఈడీ కళాశాలలకు కొమ్ముకాస్తున్న యూనివర్సిటీ అధికారులకు మంచి బుద్ధి ప్రసాదించాలి:

ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్

యోగివేమన యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా కన్వీనర్ కోట సీట్లను సైతం లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నా ఎలాంటి చర్యలు తీసుకోకుండా కొమ్ముకాస్తున్న యూనివర్సిటీ అధికారులకు మంచి బుద్ధి ప్రసాదించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) ఆధ్వర్యంలో కడప రాజీవ్ పార్క్ వద్ద గల యోగివేమన విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... యోగివేమన యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా కన్వీనర్ కోటలో సీటు పొందిన విద్యార్థుల నుండి లక్షల రూపాయలు ఫీజు చెల్లించాలని డిమాండ్ చేయడం దారుణమన్నారు. బీఈడీ కళాశాలలు అన్ని ఒక సిండికేట్ గా ఏర్పడి కన్వీనర్ కోట సీట్లను సైతం లక్ష రూపాయలకు అమ్ముకుంటున్నా యూనివర్సిటీ అధికారులు కళ్ళకు గంతలు కట్టుకొని ఉన్నారని వారు విమర్శించారు. కనీసం బీఈడీ కళాశాలల అడ్రస్ కూడా ఎక్కడ ఉందో తెలియకుండా కేవలం డబ్బులకోసమే అడ్మిషన్స్ నిర్వహిస్తూ ఎలాంటి తరగతులు సైతం నిర్వహించకుండా అక్రమాలకు పాల్పడుతుంటే అధికారులు వాటికి కొమ్ముకాస్తున్నారని వారు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బీఈడీ కళాశాలలపై యూనివర్సిటీ అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా వాటి అక్రమాలకు వంతపాడుతూ మామూళ్ల మత్తులో అధికారులు ఉన్నారని వారు తెలిపారు. నిబంధనలు పాటికుండా తరగతులు సైతం నిర్వహించకుండా కన్వీనర్ కోట సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్న కళాశాలలపై చర్యలు తీసుకునే విధంగా యోగివేమన విశ్వవిద్యాలయం అధికారులకు మంచి బుద్ధి ప్రసాదించాలని వారు కోరారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి నాయకు అఖిల్, బాలు, అంజి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి విజయలక్ష్మికి మద్దతుగా ఇంటింటి ప్రచారం

గ్లోబల్ వార్త - వేముల

వేముల మండలం వి. కొత్తపల్లి, దుగ్గన్నగారిపల్లి గ్రామాల్లో శుక్రవారం వేముల మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి బొగ్గుల విజయ లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి, పేర్ల శేషారెడ్డి , మండల నాయకులు, గ్రామ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కూటమి అభ్యర్థి విజయలక్ష్మి కి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రజలకు హామీ కల్పిస్తూ, మన ఓటు మన అభివృద్ధి! కూటమితోనే సాధ్యమవుతుందని ప్రతి గడపకు తెలియజేస్తూ ప్రచార కార్యక్రమాలు కొన సాగించారు. ఈ కార్యక్రమంలో వేముల మండల టిడిపి నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఐఎన్ఎస్ విక్రాంత్‌పై రఫేల్ జెట్ తొలిసారిగా లాండింగ్

భారత్ వాయుసేనలో తాజాగా మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. అత్యాధునిక ఫైటర్ జెట్ రఫేల్ తొలిసారిగా యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై మొదటిసారి అక్టోబర్ 29న విజయవంతంగా లాండయ్యింది. ఐఎన్ఎస్ కార్యకలాపాలకు అనుగుణంగా రఫేల్‌లో మార్పులకు భారత నేవీ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా కీలక ఘట్టమైన లాండింగ్ దిగ్విజయంగా పూర్తయ్యింది. నేవీలోకి పూర్తి స్థాయిలో రఫేల్‌ను ప్రవేశపెట్టేందుకు ఇది ముఖ్య ఘట్టమని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

రఫేల్ కోసం ఫ్రాన్స్‌తో డీల్..

భారత్‌కు అవసరమైన 26 రఫేల్ యుద్ధ విమానాల కోసం ఫ్రాన్స్‌తో 2025లో ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. రూ.63 వేల కోట్ల డీల్‌లో భాగంగా 22 సింగిల్ సీటర్ జెట్స్‌తో పాటు నాలుగు ట్విన్ సీటర్ జెట్స్‌ను ఫ్రాన్స్ సరఫరా చేయనుంది. ఫైటర్ జెట్స్‌తో పాటు ఆయుధాలు, శిక్షణ, సిమ్యులేటర్లు, ఇతర పరికరాలన్నీ ఫ్రాన్స్ సమకూర్చేలా ఒప్పందం కుదిరింది. 2030 నాటికి విమానాల్ని సరఫరా అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే భారత సిబ్బంది ఈ ఫైటర్ జెట్స్‌కు సంబంధించిన శిక్షణ పొందుతున్నారు. ఈ డీల్‌లో భాగంగా రఫేల్ ఫ్యూజిలాజ్ తయారీ, నిర్వహణ, రిపేర్లకు సంబంధించిన కేంద్రాలను భారత్‌లో ఏర్పాటు చేయనున్నారు.దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాలను రఫేల్‌తో జతపరిచేందుకు కావాల్సిన సాంకేతికతను బదిలీ చేసేందుకు కూడా ఫ్రాన్స్ అంగీకరించింది.

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం కన్నుమూత



రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎన్.బాలసుబ్రహ్మణ్యం కన్ను మూశారు. అమెరికాలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. గత కొన్నాళ్లుగా ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ తో బాధపడుతున్న బాలసుబ్ర హ్మణ్యం.. అమెరికాలో చికిత్స పొందుతూ అక్కడే కన్నుమూశారు. ఏపీఎస్ఆర్టీసీ ఎండీగా పనిచేస్తూ ఈఏడాది ఆగస్టు 31న ఆయన పదవీ విరమణ చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎస్పీగా కూడా బాలసుబ్రహ్మణ్యం పనిచేశారు.

బద్రీనాథ్ నుంచి తిరిగి వస్తుండగా హెలికాప్టర్ అదృశ్యం

ఆధ్యాత్మిక కేంద్రమైన బద్రీనాథ్ దర్శన అనంతరం తిరిగి పయనమైన ఓ హెలికాప్టర్ అదృశ్యమైంది. పైలట్‌తో పాటు ఆరుగురు వ్యక్తులు అందులో ప్రయాణిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో బద్రినాథ్ నుంచి బయలు దేరిన హెలికాప్టర్.. ఉత్తరాఖండ్‌లోని చామోలీ జిల్లాలోని జోషిమఠ్ సమీపంలో గల్లంతైంది. కాగా.. మంచు తీవ్రంగా కురుస్తున్న కారణంగా హెలికాప్టర్ క్రాష్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై జోషిమఠ్ మెజిస్ట్రేట్ చంద్రశేఖర్ వశిష్ఠ స్పందించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే.. ఆర్మీ, ఎస్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని హెలికాప్టర్ కోసం గాలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా.. గతేడాది జూన్‌లో కూడా కేదార్‌నాథ్ సమీపంలోని అడవుల్లో ఓ హెలికాప్టర్ అదృశ్యమైన ఘటనలో ఏడుగురు మృతి చెందారు.



జగన్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలి.. కేంద్రఎన్నికల సంఘానికి వర్ల రామయ్య విజ్ఞప్తి

గ్లోబల్ వార్త – అమరావతి : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల జగన్, ఆ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నల వర్షం కురిపించారు. నైతిక విలువలు లేని రాజకీయ పార్టీకి అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి అంటూ వ్యాఖ్యానించారు. వైసీపీ ఒక రాజకీయ పార్టీ కాదని.. అసాంఘీక శక్తులకు అడ్డా అని అన్నారు. దీనికి ముఠా నాయకుడు జగన్ అంటూ విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యహితంగా ప్రజలకు సమన్యాయం అందించేందుకు రాజకీయ పార్టీ పెడతారు తప్ప.. జగన్ లాగా స్వార్థ రాజకీయల కోసం కాదని అన్నారు. 'రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా, నేను పులివెందుల వస్తా ఎన్నికలప్పుడు చేతులు మడుస్తా అంటే.. అరాచకం చేస్తాననేనా జగన్? ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల సమయంలో చేతులు మడుస్తానని అటు ప్రజలను ఇటు పోలీసులను భయభ్రాంతులను చేయడం తగునా జగన్. మీ నాయకుడు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఎందుకు రాష్ట్రం వదిలి ఇతర రాష్ట్రాలకు పరారయ్యాడో సమాధానం చెప్పగలరా జగన్? మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మద్యం కుంభకోణం, కల్తీ మద్యం సరఫరా, స్వామి వారి లడ్డూ కల్తీ వీటన్నింటిలో అరెస్ట్ అయినా మీ దగ్గర పనిచేసిన నాయకులను చూసి కూడా మీది రాజకీయ పార్టీ అని ధైర్యంగా చెప్తారా జగన్' అంటూ ప్రశ్నలు సంధించారు. అంతేకాకుండా వైసీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, మాజీ మంత్రి రోజా, ఎంపీ అవినాశ్ రెడ్డి కూడా పోలీసులను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యాఖ్యలు చేశారని.. వాటికి ఏం సమాధానం చెబుతారంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి, చెల్లిని నిర్లక్ష్యం చేసి రోడ్డునపడేసిన జగన్‌కు నైతిక విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా అని ఎమ్మెల్సీ నిలదీశారు. జగన్, అతని పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును, వారి వ్యాఖ్యల వీడియోలు తెప్పించుకుని ప్రెస్ క్లిప్పింగ్స్ చూసి.. ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఎమ్మెల్సీ వర్ల రామయ్య కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌పై కలెక్టర్ ప్రత్యేక దృష్టి.. తప్పులకు తావివ్వొద్దు

ప్రతి ఓటూ చెల్లుబాటు కావాలి.. ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలి
పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



గ్లోబల్ వార్త – పుట్టపర్తి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే ప్రతి ఒక్కరికీ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పుట్టపర్తి రూరల్ మండల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కొత్తచెరువులోని పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఓటింగ్ ఏర్పాట్లను పరిశీలించి, ప్రక్రియ నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు హెల్ప్‌డెస్క్ ద్వారా పూర్తిస్థాయి సహకారం అందించాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ కవర్లు, డిక్లరేషన్ ఫారాల్లో నమోదు చేయాల్సిన వివరాలపై ఓటర్లకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసేలా తగిన మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారు. చిన్నచిన్న పొరపాట్ల కారణంగా ఓట్లు చెల్లకుండా పోయే పరిస్థితి తలెత్తకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ముందస్తుగా సరైన అవగాహన కల్పించడం ద్వారా ఓటర్ల సమయం ఆదా కావడంతో పాటు, వారు తమ ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో పుట్టపర్తి రిటర్నింగ్ అధికారి రమేష్ బాబు, ఎంపీడీవో నరేష్ కృష్ణ, పోలింగ్ కేంద్రం పర్యవేక్షకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనసీమలో మళ్లీ గ్యాస్ లీక్.. భయాందోళనలో మాచవరం గ్రామస్తులు



గ్లోబల్ వార్త – అంబేద్కర్ కోనసీమ జిల్లా : కోనసీమ జిల్లాలో మరోసారి గ్యాస్ లీక్ కలకలం రేపుతోంది. అంబాజీపేట మండలం మాచవరం గ్రామంలోని పంట పొలాల్లో పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీక్ అవుతుండటాన్ని స్థానికులు గుర్తించారు. గ్యాస్ లీకేజీపై సమాచారం అందిన వెంటనే ఓఎన్జీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీకేజీని అదుపు చేసేందుకు ఓఎన్జీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 26న ఇదే ప్రాంతంలో గ్యాస్ లీకైన విషయం తెలిసిందే. మళ్లీ అక్కడే మరోసారి గ్యాస్ లీక్ అవ్వడంతో స్థానికులు భయాం దోళనకు గురవుతున్న పరిస్థితి. త్వరితగతిన ఈ లీకేజీని అదుపు చేయాలని, తర చూ గ్యాస్ లీకేజీలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

అల్లర్లు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
ఎన్నికల బందోబస్తు విధుల్లో 1,500 మంది పోలీసు సిబ్బంది
సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ...
జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

గ్లోబల్ వార్త – శ్రీ సత్యసాయి జిల్లా

శ్రీ సత్యసాయి జిలాలో మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ గారు తెలిపారు.నవంబర్ 1వ తేదీ ఆదివారం జిల్లాలోని పుట్టపర్తి, హిందూపురం, కదిరి, పెనుకొండ, మడకశిర, ధర్మ వరం మున్సిపాలిటీల పరిధిలో జరగనున్న పోలింగ్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల భద్రతా విధుల కోసం సుమారు 1,500 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ గారు వివరించారు. పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక (సెన్సిటివ్), అత్యంత సమస్యాత్మక (హైపర్ సెన్సిటివ్) కేంద్రాలు గా గుర్తించి, ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సివిల్ పోలీసులతో పాటు ఏఆర్, స్పెషల్ పార్టీలు, ఏపీఎస్పీ బలగాలను మోహరిం చినట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసు బృందాలు, రూట్ మొబైల్స్, 61 స్ట్రైకింగ్ ఫోర్సులతో నిరంతర గస్తీ, పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను సైతం సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళి అమలులో (దీమీూ)సెక్షన్ 163 పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉన్న నిబంధనలతో పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ప్రతి పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు విధించినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా అదనపు బలగాలను మోహరించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బయటి వ్యక్తుల అక్రమ ప్రవేశాన్ని అరికట్టడంతో పాటు అక్రమ నగదు, మద్యం రవాణాను నియంత్రించేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. అల్లర్లు సృష్టించినా, ఎన్నికలకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరి చడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ఘర్షణ లు లేదా అల్లర్లకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకా రం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలు లేదా ఎన్నికల అక్రమాలు ఏవైనా దృష్టికి వస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.



ప్రకృతి విపత్తుల్లో ప్రజలకు అండగా సీఎం చంద్రబాబు
జగన్‌పై మంత్రి సవిత విమర్శలు!



గ్లోబల్ వార్త – అమరావతి

సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ గా నిలుస్తున్నారని మంత్రి సవిత అన్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సంక్షేమం కోసం పరితపించే నాయకుడని కొనియాడారు. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారీ బాధితులకు అండగా నిలుస్తూ.. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తారని చెప్పారు. విజయవాడ వరదల సమయం లోనూ, తాజాగా ఆర్నాల్ తుపాను సమయంలోనూ నిద్రపోకుండా ప్రజల కోసం పని చేశారని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు స్వయంగా పర్యటించి బాధితులకు భరోసా కల్పించారని.. బాధితులందరికీ న్యాయం చేస్తామని ఇప్పటికే ప్రకటించారని తెలిపారు. అయితే.. గత ప్రభుత్వ హయాంలో జగన్ వ్యవహరించిన తీరుపై మంత్రి విమర్శలు గుప్పించారు. వరద బాధితులను పరామర్శించే పేరుతో సినిమా సెట్టింగులు ఏర్పాటు చేశారని.. తుపాను సమయంలో ఐమాక్స్ థియేటర్‌లో సినిమా చూస్తూ గడిపారని ఆరోపించారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 42 మంది మరణించిన సమయంలోనూ బాధితులను పరామర్శించ లేదని విమర్శించారు. ప్రజల కష్టాలు, బాధితులను ఆదుకోవడం గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని సవిత వ్యాఖ్యానించారు.



ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి
హోం మంత్రి అనిత

గ్లోబల్ వార్త – అనకాపల్లి జిల్లా : ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఆయా గ్రామాల్లో రోడ్లు వేశామని.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత సుడిగాలి పర్యటన చేశారు. యస్ రాయవరం, పాయకరావుపేట మండలాల్లో పలు గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌చూసి ఓట్లు వేయాలని కోరారు. అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం రోడ్డుని పూర్తి చేశామని తెలిపారు. నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్, టాయ్ పార్క్ లాంటి పరిశ్రమలు వచ్చాయని వివరించారు. టాయ్ పార్కుతో 25 వేల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పుకొచ్చారు. గోదావరి జలాలు పేట నియోజకవర్గానికి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికి పట్టం కట్టాలని హోం మంత్రి అనిత కోరారు.

నాలుగో టీ20: తడబడ్డ భారత బ్యాటర్లు న్యూజిలాండ్ ఘన విజయం




ఆక్లాండ్ వేదికగా భారత్‌తో జరిగిన నాలుగో టీ20లో న్యూజిలాండ్ 87 పరుగుల తేడాతో విజయం సాధించింది. 260 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ పూర్తిగా విఫలమైంది. నిర్ణీత 20 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 172 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో కివీస్ గెలుపు ఖాతా తెరిచింది. 3-1 తేడాతో నిలిచి.. సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేయకుండా అడ్డుకుంది.

భారత బ్యాటర్లలో తిలక్ వర్మ(35) టాప్ స్కోరర్. సంజు శాంసన్(4), అభిషేక్ శర్మ(27), ఇషాన్ కిషన్(0), శ్రేయస్ అయ్యర్(22), అక్షర్ పటేల్(7), నితీశ్ కుమార్ రెడ్డి(21), నమన్ ధీర్(28), అర్ష్‌దీప్ సింగ్(0) వరుసగా పెవిలియన్ బాట పట్టారు. ప్రిన్స్ యాదవ్(18లి), మయాంక్ యాదవ్(3లి) నాటౌట్‌గా నిలిచారు. న్యూజిలాండ్ బౌలర్లలో డఫీ 4, ఫిషర్, శాంట్నర్ చెరో 2, మిల్నే ఒక వికెట్ పడగొట్టారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 259 పరుగులు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్(107; 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లు) సెంచరీతో చెలరేగాడు. మరో బ్యాటర్ బ్రేస్‌వెల్(65; 25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 3, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ తలొక వికెట్ పడగొట్టారు. కాగా ఈ సిరీస్‌లో ఆఖరి మ్యాచ్ హామిల్టన్ వేదికగా ఆదివారం జరగనుంది.

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ప్రసిద్ధ్ కృష్ణ దూరం.. బీసీసీఐ కీలక ప్రకటన..



న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు వన్డేల సిరీస్‌కు ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ దూరమయ్యాడు. తొడ కండరాల గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని జట్టు నుంచి తప్పిస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా ప్రసిద్ధ్ కృష్ణ ఎడమ తొడ కండరానికి గాయమైంది. అప్పటి నుంచి అతడు చికిత్స తీసుకుంటున్నాడు. మరోవైపు మహమ్మద్ సిరాజ్, నితీశ్ కుమార్ రెడ్డికి భారత్-ఎ జట్టులో ఆడే అవకాశాలు కల్పించింది..
న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఆడాలంటే ఫిట్‌నెస్ పరీక్షలో ప్రసిద్ధ్ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. తాజాగా నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్ట్‌లో అతడు విఫలమయ్యాయాడు. దీంతో ఐదు వన్డేల సిరీస్‌కు అతడు దూరమయ్యాడు. పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రసిద్ధ్ మైదానంలోకి దిగుతాడని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ వన్డే సిరీస్‌కు దూరమైనప్పటికీ న్యూజిలాండ్-ఎతో జరిగే చివరి నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. అయితే దీనికి ముందుగా అతడు రిటర్న్ టు ప్లే (ఆర్‌టీపీ) ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి .

మరోవైపు న్యూజిలాండ్-ఎతో జరిగే నాలుగు రోజుల మ్యాచ్‌కు ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ భారత్-ఎ జట్టుతో కలవనున్నాడు. అక్టోబర్ 31 నుంచి న్యూజిలాండ్-ఎతో ప్రారంభమయ్యే రెండో నాలుగు రోజుల మ్యాచ్‌లో అతడు ఆడనున్నాడు. టెస్టు సిరీస్‌కు ముందు మ్యాచ్ ప్రాక్టీస్ పొందడం సిరాజ్‌కు ఉపయోగపడనుంది. అలాగే ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా మూడో నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆడనున్నాయి. తొలి వన్డే పూర్తయిన తర్వాత న్యూజి లాండ్-ఎతో జరిగే మూడో నాలుగు రోజుల మ్యాచ్ కోసం భారత్-ఎ జట్టుతో కలవనున్నాడు.



కివీస్‌తో నాలుగో టీ20: ఫిలిప్స్ సూపర్ సెంచరీ..

ఆక్లాండ్ వేదికగా భారత్-న్యూజిలాండ్ జట్లు నాలుగో టీ20లో తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ భారీ స్కోర్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 259 పరుగులు సాధించింది. భారత్‌కు 260 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. గ్లెన్ ఫిలిప్స్(107; 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లు) సెంచరీతో చెలరేగాడు. మరో బ్యాటర్ బ్రేస్‌వెల్(65; 25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. వీరిద్దరూ కలిసి ఐదో వికెట్‌కు 40 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఫిన్ అలెన్(31), మిచెల్(24) పర్వాలేదని పించారు. సీఫర్ట్(3), జాకబ్స్(7), శాంట్నర్(5) విఫలమయ్యారు. స్మిత్(6లి), మిల్నే(1లి) నాటౌట్‌గా నిలిచారు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 3, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ తలొక వికెట్ పడగొట్టారు.



హర్మన్, సుఖ్‌జీత్ డబుల్ ధమాకా
5-2తో చైనాపై భారత్ గెలుపుఫ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

జలంధర్: కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, స్ట్రయికర్ సుఖ్‌జీత్ సింగ్ డబుల్ ధమాకా సృష్టించడంతో.. ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 5-2తో చైనాను ఓడించింది. సుఖ్‌జీత్ (12వ, 34వ) రెండు ఫీల్డ్ గోల్స్ చేయగా.. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ (27వ, 31వ), జుగ్‌రాజ్ సింగ్ (47వ) పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచారు. చైనాకు లభించిన పీసీలను పెంగ్ యాంగ్ (26వ), చోంగ్ కాంగ్ చెన్ (36వ) గోల్‌లోకి పంపారు. ఇతర మ్యాచ్‌ల్లో ఆసియాడ్ రజత పతక విజేత మలేసియా 3-1తో దక్షిణ కొరియాపై, జపాన్ 1-0తో బంగ్లాదేశ్‌పై గెలిచాయి.



ముంబై బౌలింగ్ కోచ్ మలింగపై వేటు

ముంబై: ముంబై ఇండియన్స్‌లో సుదీర్ఘకాలం ఆటగాడిగా, ఆ తర్వాత బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన మాజీ పేసర్ లసిత్ మలింగపై వేటు పడింది. కొన్ని సీజన్లుగా జట్టు పేలవ ప్రదర్శన కనబరుస్తున్నందున తమ కోచింగ్ సిబ్బందిలో యాజమాన్యం మార్పులు చేస్తోంది. ఇందులో భాగంగా బౌలింగ్ కోచ్‌లు మ లింగ, పారస్ మాంబ్రేలతో పాటు ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్కిన్సన్‌లపైనా వేటు వేసింది. హైదరాబాద్‌కు చెందిన టి. దిలీప్ కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా జట్టులో చేరే అవకాశం ఉంది. శ్రీలంకకు చెందిన మలింగ 2013, 2015, 2017, 2019 సీజన్లలో ముంబై చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు.



మహిళల దేశవాళీ టీ20ల్లో ఢిల్లీ ప్రపంచ రికార్డు స్కోరు

పుణె: మహిళల దేశవాళీ టీ20 మ్యాచ్‌లో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా ఢిల్లీ ప్రపంచ రికార్డు సృష్టించింది. సీనియర్ మహిళల టీ20 ట్రోఫీలో భాగంగా గురువారం హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్లకు 262 పరుగుల రికార్డు స్కోరు చేసింది. తనీషా సింగ్ (47 బంతుల్లో 119) వేగవంతమైన శతకం సాధించింది. ఛేదనలో హైదరాబాద్ 154/8 స్కోరు మాత్రమే చేసింది. దీంతో ఢిల్లీ 108 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా, 2019-20 సీజన్‌లో అరుణాచల్ ప్రదేశ్‌పై గోవా చేసిన 252/2 రికార్డు స్కోరును ఇప్పుడు ఢిల్లీ అధిగమించింది.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA
D.NO. 28-2-22, II FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520002. EDITOR DONDLAVAGU BHAVYA. PH . 08562-461571 APTEL/2025/16480